క్లుప్తంగా

భగవద్గీత శ్లోకాలు ఆలపించిన చిన్నారి



చిన్నారి ప్రవాసినిని సన్మానిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళా ప్రాంగణంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన చెందిన చిన్నారి ఎం.ప్రవాసిని భగవద్గీత 12వ అధ్యాయం పఠించింది. అలాగే ఆంగ్లంలో అర్థం వివరించింది. భక్తులు ఆనందంగా తిలకించి ఆ చిన్నారిని ఆశీర్వదించారు. గతంలో ఈ చిన్నారి రాష్ట్రస్థాయి లో అనేక అవార్డులు పొందింది. అనంతరం శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున చిన్నారికి తీర్థప్రసాదాలు, సర్టిఫికెట్ అందించి, ఆశీర్వదించారు

ఇంటి స్థలాలకు అర్హులను గుర్తించండి



వీఆర్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్ బాబు

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇవ్వనున్న మూడు సెంట్లు ఇంటి స్థలాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పూర్తిగా ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించి వారి నుంచి అర్జీలు తీసుకోవాలని సూచించారు. అలాగే సచివాలయాలు, మీసేవా కేంద్రాల ద్వారా వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సేవలందించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటి స్థలాలకు వినతి



తహసీల్దార్ సుబ్రమణ్యంకు విన్నవిస్తున్న గ్రామస్తులు


బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామస్తులు సోమవారం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యంకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేకపోవడంతో ఒకే ఇంటిలో మూడు కుటుంబాల వారు నివాసిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253 సర్వే నంబర్లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి, ఇంటి స్థలాలను ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు రమణయ్య, దేవకుమార్, సుధాకర్, షణ్ముగం, ఓసూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలో భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మండల భవన కార్మికుల సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన కార్మికులతో కలసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రాజశేఖర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వార్షిక కౌలు వేలం రేపు

నారాయణవనం: నారాయణవనం మేజర్ పంచాయతీలో ఆదాయ వనరుల వార్షిక కౌలుకు వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి షణ్ముగం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టూరిస్ట్ బస్టాండ్, వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, జంతువధశాల, ఆటో స్టాండ్, పంచాయతీ రూముల అద్దెకు వార్షిక కౌలుకు బుధవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధరావతు సొమ్ముతో పాటు సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను సమర్పించి పాల్గొనవచ్చన్నారు.

బ్రాస్‌లెట్ అందజేత



ప్రేమ్‌కుమార్‌కు బ్రాస్‌లెట్ అందజేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం తొట్టంబేడు మండలం, కొత్తకండ్రిగకు చెందిన ప్రేమ్‌కుమార్ దర్శించుకున్నాడు. ఈ సమయంలో అతని చేతికి ఉన్న మూడు సవర్ల బ్రాస్‌లెట్‌ను ఆలయంలో పోగొట్టుకున్నాడు. ఆలయంలో పారిశుద్ధ్య విభాగంలో పని చేసే రెగ్యులర్ స్వీపర్ మాధవయ్య ఆ బ్రాస్‌లెట్‌ను గుర్తించి ఆలయ అధికారులకు అందజేశారు. దాని విలువ రూ.2 లక్షలు ఉంటుంది. వివరాలు ఆరా తీసి దాన్ని బాధితుడికి అప్పగించారు. దీంతో ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

బుచ్చినాయుడుకండ్రిగలో వరి ధాన్యం రాశి వద్ద దిగాలుగా ఉన్న రైతు



కల్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

ఆరుగాలం శ్రమించిన రైతు ప్రతిసారి ప్రకృతి చేతిలోనో, పాలకుల నిర్లక్ష్య విధానాల వల్లో నష్టపోతూనే ఉన్నాడు. రైతే దేశానికి వెన్నెముక. కానీ మొన్నటి ఎన్నికల్లో వ్యవసాయానికి పెద్దపీట వేస్తాం అంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు అధికార పీఠం ఎక్కగానే వ్యవసాయాన్ని తుంగలో తొక్కేస్తున్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకుంటే.. కూటమి ప్రభుత్వం మాత్రం వరి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం శోచనీయం.

- దళారుల దందా
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- వర్షాలకు భారీగా తగ్గిన పంట దిగుబడి
- ధర లేక.. పెట్టుబడి రాక.. అన్నదాతలకు తీరని నష్టం
- బస్తా ధర కేవలం రూ.1600
- ముందుకురాని వ్యాపారులు

బుచ్చినాయుడుకండ్రిగ: వరి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కూటమి ప్రభుత్వ పాలకులు కనీసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో దళారులు రాజ్యమేలుతున్నారు. మరోవైపు ఈసారి భారీ వర్షాలు, తుపాన్ల ధాటికి వరి పంట వేసిన రైతులకు ఈసారి పెట్టుబడి పెరిగింది. తెగుళ్ల వల్ల పంట దెబ్బతింది. పంటను కాపాడుకునేందుకు రైతులు అధిక మొత్తంలో రసాయన మందులను స్ప్రే చేశారు. గతంలో కన్నా ఈసారి పెట్టుబడి పెరగడం, దిగుబడి భారీగా తగ్గడంతో వరి రైతు విలవిల్లాడుతున్నారు. పండిన పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఏదో ఒక ధరకు తెగనమ్ముకోవడానికి ప్రయత్నం చేస్తున్నా.. వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. వ్యాపారులు రాక రైతులు ధాన్యాన్ని కల్లంలోనే రాశులు పోసి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వరికి గిట్టుబాటు ధర కల్పించి, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అధిక మొత్తంలో వరిసాగు ..

మండలంలో ఎక్కువ మంది రైతులు వరిపంటను సాగు చేస్తారు. ఈ రబీ సీజన్‌లో 9 వేల ఎకరాల్లో వరిపంట సాగు అయింది. ఎకరాకు రూ.30 వేలు ఖర్చు అయింది. ఈ రబీ సీజన్‌లో సేద్యం మొదలు పెట్టినప్పటి నుంచి పంట ఎన్ను తీసే వరకు రెండు సార్లు భారీ వర్షాలు కురిశాయి. మరో రెండుసార్లు అకాల వర్షాలు కురవడంతో వరిపంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఎకరాకు కేవలం 20 నుంచి 25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది.

కనిపించని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మండలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారులు తాము చెప్పిందే ధర అన్నట్టు వ్యవహరిస్తున్నారు. కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. గతేడాది పెద్ద జిలకర్లు, కేఎంఆర్ (రకం 1630) రకం బస్తా ధాన్యం రూ.2 వేలు నుంచి రూ.2175 వరకు ధర పలికింది. అదే రకాలు ఇప్పుడు రూ.1600 నుంచి రూ.1650 వరకు ధర పలుకుతున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే గిట్టుబాటు ధర లభించేది. దీనికి తోడు దళారులు నెమ్ము, గోనె సంచి తూకం పేరిట 75 కేజీల బస్తాకు 4 కేజీల వరకు కోత విధిస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.



కల్లంలో ఉన్న ధాన్యం



బస్తాల్లోకి ధాన్యం నింపుతున్న కూలీలు

లక్ష నష్టం వచ్చింది



ఈ ఏడాది 10 ఎకరాల్లో వరిపంట సాగు చేశాను. అయితే ఏటా కంటే ఈ ఏడాది తీవ్ర వర్షాల వల్ల పంట దిగుబడి బాగా తగ్గింది. గత ప్రభుత్వం రైతులు శ్రేయస్సు కోరి మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ప్రభుత్వం తరఫున కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రాజ్యం ఏలుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2300కు గాను రూ.1650 లకే కొనుగోలు చేస్తున్నారు. రూ.లక్ష నష్టపోయాను.

\- నాగేశ్వరరావు, బుచ్చినాయుడుకండ్రిగ

పెట్టుబడి కూడా రాలేదు



నేను సొంత భూమి ఎకరా వరిపంటను సాగు చేశాను. వరుస తుపానులు, అకాల వర్షాలతో పంట దెబ్బతినింది. ఎకరా 20 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడి కూడా రాలేదు. ప్రభుత ఆదుకోకపోతే నష్టాల ఊబిలో కూరుకుపోవాల్సిందే.

\- రమణయ్య, నీర్పాకోట గ్రామం

దళారులపై చర్యలు తీసుకుంటాం



దళారులపై చర్యలు తీసుకుంటాం. రైతులకు మద్దతు ధర ప్రకారం వరి కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా గ్రేడ్ ఏ రకం 75 కేజీల బస్తా రూ.1,740, సాధారణ రకం ధాన్యం రూ.1725లకు కొనుగోలు చేస్తాం.

\- భారతి, ఏఓ, బుచ్చినాయుడుకండ్రిగ

చంద్రబాబు వ్యాఖ్యలు సమంజసం కాదు



వైఎస్సార్‌సీపీ కన్వీనరు మణినాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్‌సీపీ వాళ్లకు పనులు చేస్తే పాముకు పాలు పోసినట్టే అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ కన్వీనరు మణినాయుడు ఖండించారు. రాజ్యాంగబద్ధంగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా సేవ చేయాల్సిన వ్యక్తి ఇలా మాట్లాడడం బాధాకరమన్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తున్న చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించారని గుర్తు చేశారు.

హైవేపై కూలిన చింతచెట్టు



రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చింతచెట్టు

నాగలాపురం: మండలంలోని బైటకొడియంబేడు గ్రామం వద్ద పుత్తూరు-చెన్నై హైవేపై ఆదివారం రాత్రి ఓ భారీ చింతచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో పుత్తూరు-చెన్నై మార్గంలో రెండు గంటల పాటు వాహనాలు రాకపోకలు స్తంభించిపోయాయి. విషయం స్థానిక ఎస్‌ఐ సునీల్‌కు సమాచారం అందడంతో ఎస్‌ఐ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చింతచెట్టును జేసీబీ, స్థానికుల సహాయంతో తొలగించారు.

మూలస్థానేశ్వరాలయంలో రుద్రాభిషేకం



మూలస్థానేశ్వరున్ని దర్శించుకుంటున్న ఉభయదాతలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మహాశివరాత్రి మహోత్సవాల అనంతరం తొలి సోమవారం రోజున రేణిగుంట మండలం గాజులమండ్యంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనుంజయ రెడ్డి పర్యవేక్షణలో ఉభయదారులు గోవింద రెడ్డి గారి రోశమ్మ, నారాయణరెడ్డి, లావణ్య, కమలాకర్ రెడ్డి, కుసుమ, యాదవేంద్ర రెడ్డి దంపతులు రుద్ర హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గ్రామస్తులు ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు.

పరశురామేశ్వరుడి సేవలో గాయకుడు శ్రీకృష్ణ



గుడిమల్లం ఆలయాన్ని సందర్శించిన సింగర్ శ్రీకృష్ణ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం గుడిమల్లంలోని శ్రీ పరశురామేశ్వరున్ని సోమవారం తెలుగు సినీ గాయకుడు శ్రీకృష్ణ విష్ణుబొట్ల దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం చేయించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రికెట్ టోర్నీ విజేతగా చోటా లెవెన్స్



రాజరాజేశ్వరి దేవి ఆలయంలో చోటా లెవెన్స్ జట్టు సభ్యులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట విమానాశ్రయం మార్గంలోని క్రీడా మైదానంలో నిర్వాహకులు రమేష్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ టీ-10 క్రికెట్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ లెవెన్స్, చోటా లెవెన్స్ తలపడ్డాయి. ఇందులో చోటా లెవెన్స్ విజేతగా నిలిచి కప్పును కైవసం చేసుకుంది. శ్రీ రాజరాజేశ్వరి పీఠం పీఠాధిపతి మూర్తి స్వామి చేతుల మీదుగా విజేత జట్టుకు కప్పుతో పాటు రూ.లక్ష బహుమతిగా అందజేశారు. టోర్నీ నిర్వాహకుడు రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం క్రీడాకారులు, నిర్వాహకులు బిస్మిల్లానగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎలైట్ హాస్పిటల్ అధినేత కోడూరు బాలసుబ్రమణ్యం, డాలర్స్ గ్రూప్ ఇన్‌చార్జ్ సోము, జట్టు కెప్టెన్ జశ్వంత్, వైస్ కెప్టెన్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కలశోద్వాసన



ప్రత్యేకాలంకరణలో శివపార్వతులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శైవాగమన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ధ్వజారోహణం సందర్భంగా నిర్వహించిన విధంగానే స్వామివారి గర్భాలయం వద్ద ఉత్సవమూర్తులను ఉంచుతారు. ధ్వజస్తంభానికి త్రిశూలంతో పాటు జ్ఞానప్రసూనాంబ సమేత సోమస్కంధమూర్తి ఉత్సవమూర్తులను ఉంచి సంకల్ప పూజలు ప్రారంభించారు. అంకురార్పణ సందర్భంగా ధ్వజస్తంభం మీదకు అధిరోహించిన ధ్వజపటాన్ని, ధవళ వస్త్రంతో పాటు భక్తులు సమర్పించిన చీరలను కిందకు దింపారు. రాత్రి స్వామి, అమ్మవార్లు సింహాసనం ఊరేగారు. ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు పల్లకీసేవ..

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధ్వజావరోహణం ముగిసిన మరుసటి రోజు పల్లకీ సేవ నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్ల పల్లకీసేవ నిర్వహించనున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి, వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. వేసవికాలం సమీపిస్తుండడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ మునిసుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఏపీఓ భానుప్రియ, ఏఓ భారతి, ఆర్ఐ నల్లయ్య పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ గుంతలను పూడ్చండి



మెయిన్‌రోడ్డులో ఉన్న గ్యాస్ పైపులైన్ గుంత, మట్టిదిబ్బ



పెట్రోల్ బంకు వద్ద ఉన్న గ్యాస్ పైపులైన్ గొయ్యి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని మెయిన్‌రోడ్డులో ఓ వైపున వేస్తున్న గ్యాస్ పైపులైన్ గుంతలను గత 20 రోజులుగా పూడ్చకపోవడంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో వాహనదారులు, షాపుల యాజమానులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మెయిన్‌రోడ్డులో గ్యాస్ పైపులైన్ గుంతలతో పాటు గుంతలలో తీసిన మట్టి దిబ్బలుగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్యాస్ పైపులైన్ తీసి 20 రోజులు కావొస్తున్నా గుంతలను పూడ్చకుండా మట్టి దిబ్బలు రోడ్డు పక్కనే ఉన్నాయి. పని అయిన వెంటనే పైపులైన్ గుంతలను పూడ్చకుండా, రోడ్డుపై మట్టి దిబ్బలు ఉన్నాయని, సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌లోని గుంతలను పూడ్చాలని వాహనదారులు, షాపుల యాజమానులు కోరుతున్నారు.

అర్ధశతాబ్దపు కలయిక



పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న తోటిమిత్రులు

ఏర్పేడు(రేణిగుంట): వారంతా 50 ఏళ్ల కిందట ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివారు. మళ్లీ వారంతా విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల ప్రాంగణంలోనే ఇన్నేళ్ల తరువాత ఆదివారం సమావేశమయ్యారు. అర్ధశతాబ్దం తరువాత కలిసిన వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కష్టసుఖాలు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థి, పాపానాయుడుపేట మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యంను తోటిమిత్రులు ఘనంగా సన్మానించారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తోడుగా నిలుస్తామని స్పష్టం చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో మృతి చెందిన రెండు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. పట్టణానికి చెందిన వాసు అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా 27వ వార్డుకు చెందిన మునగాల నారాయణ మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు కంఠా ఉదయ్‌కుమార్, సాధన మున్నా, బుల్లెట్ జయశ్యామ్, తీగల చిన్న తదితరులు పాల్గొన్నారు.

బాలికలను కాపాడుకుందాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నారాయణవనం: కిశోర బాలికలను బాల్య వివాహాల నుంచి కాపాడుకుంటూ, వారిని బాగా చదివిద్దామని ఐసీడీఎస్ పీజేడీ శోభారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం భాగంగా వారం రోజుల కార్యక్రమంలో సోమవారం మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలన అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ బాలికల సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై ఉందన్నారు. బాల్య వివాహాలతో కిశోర బాలికలకు శారీరక సమస్యలతో పాటు మానసికంగానూ ఇబ్బందులను ఎదుర్కొనే శక్తి ఉండదన్నారు. సమస్యలను మనోధైర్యంతో అధిగమించి, ఆత్మరక్షణ పద్ధతులు, బాలికల అక్రమ రవాణా, బాల్య కార్మికుల నిర్మూలన, పౌష్టికాహారం, రక్తహీనతలపై అవగాహన పెంచుకోవాలని శోభారాణి అన్నారు.

అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించి, సంతకాలు సేకరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్ర మణ్యం, సూపర్‌వైజర్ బేబీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, హరిప్రియ, సరళ, శకుంతల, సంపూర్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షికారీల నిరసన



వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న షికారీలు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు సమీపంలోని శోత్రియ భూముల్లో షికారీలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవం బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన షికారీలతో కలిసి వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా శోత్రియ భూముల్లో నక్కలమిట్ట వద్ద గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న వారిపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే పట్టాలు పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ మండల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే షికారీలతో కలసి తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు.